సాక్షి అనకాపల్లి


గురువారం । 11 । సెప్టెంబర్ । 2025

రయ్.. రయ్



పోలీసుల చేతికి అధు నాతన పెట్రోలింగ్ బైకులు వచ్చాయి. పరవాడ సబ్ డివిజ న్‌లో ట్రాఫిక్ సమస్యకు చెక్ పెట్టేం దుకు ఇవి దోహద పడతాయి. 8లో

23 నుంచి శరన్నవరాత్రి ఉత్సవాలు



ఈ నెల 23 నుంచి అక్టోబరు 1 వరకు సింహగిరిపై శరన్నవ రాత్రి ఉత్సవాలను నిర్వ హించనున్నారు. ప్రతిరోజూ ఆలయంలో శ్రీ రామాయణ నవరాత్ర పారాయణం ఉంటుందని ఈవో చెప్పారు. 8లో



స్నాతకోత్సవ నిర్వహణపై సమీక్ష

మద్దిలపాలెం: ఏయూ స్నాతకోత్సవ నిర్వ హణపై వీసీ ఆచార్య రాజశేఖర్ అధికారు లతో సమీక్షించారు.

న్యూస్‌రీల్

రోజూ 500 క్యూసెక్కుల నీరు విడుదల

- తాండవ రిజర్వాయరు జేఈ శ్యామ్‌కుమార్



తాండవ కాలువలో నీటిని పరిశీలిస్తున్న జేఈ శ్యామ్‌కుమార్

నాతవరం : ఖరీఫ్ పంట సాగుకు రెండు కాలువల ద్వారా రోజు 500 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నామని తాండవ జేఈ శ్యామ్‌కుమార్ చెప్పారు. ఆయన బుధవారం రెండు జిల్లాల సరిహద్దులో శివారు ఆయకట్టు భూములకు ప్రవహిస్తున్న తాండవ ఎడమ కాలువ నీటి ప్రవాహాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రిజర్వాయరులో నీటిమట్టం బుధవారం సాయంత్రానికి 375.3 అడుగులు ఉందన్నారు. తాండవ ప్రాజెక్టు ప్రమాదస్థాయి నీటిమట్టం 380 అడుగులు, డెడ్ స్టోరేజీ నీటి మట్టం 345 అడుగులుగా పరి గణిస్తామన్నారు. ఈ ఏడాది ఖరీఫ్ సాగుకు తాండవ నుంచి ఆగస్టు 10న ఆయకట్టుకు నీరు విడుదల చేశామని గుర్తు చేశారు. వర్షాలు బాగా కురవడంతో నీటిని పంట కాలువలు ద్వారా విడుదల చేసినా ప్రాజెక్టులో నీటి మట్టం తగ్గలేదన్నారు. నీరు పుష్కలంగా ఉన్న ప్పటికీ ఆయకట్టు రైతులు నీరు పొదుపుగా వాడుకోవాలన్నారు. కార్యక్రమంలో తాండవ ప్రాజెక్టు నాతవరం సెక్షన్ వర్కు ఇన్‌స్పెక్టరు అప్పారావు సిబ్బంది ఉన్నారు.

దళిత రైతుల సమస్యపై స్పీకర్ స్పందించాలి

- సీపీఎం నాయకుల డిమాండ్
- 50వ రోజుకు చేరుకున్న నిరసన



ప్లేట్లతో నిరసన తెలుపుతున్న బాధిత రైతులు, సీపీఎం నాయకులు

నర్సీపట్నం: మాకవరపాలెం, జి.కోడూరు క్వారీ బాధితుల నిరసన కార్యక్రమం 50వ రోజూ కొనసాగింది. బుధవారం సీపీఎం నాయకులు శిబిరాన్ని సందర్శించి మద్దతు తెలి యజేశారు. బాధితులతో కలిసి ఆర్డీవో కార్యా లయం వద్ద ప్లేట్లతో నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కార్యదర్శి జి.కోటేశ్వరరావు మాట్లాడుతూ తమ న్యాయ మైన సమస్యను పరిష్కరించాలని రోజుల తర బడి దళిత రైతులు నిరసన చేస్తున్నా స్పీకర్ అయ్యన్నపాత్రుడు పట్టించుకోకపోవటం దారుణమన్నారు. ఇప్పటికైనా స్పీకర్ స్పందిం చి బాధిత రైతులకు న్యాయం చేయాలన్నారు. ఆర్డీవో, మైనింగ్ అధికారులు బాధిత రైతుల న్యాయమైన డిమాండ్ల పట్ల స్పందించకపో వడం దుర్మార్గమన్నారు. క్వారీ నిర్వహణ వల్ల సాగు చేసుకుంటున్న జీడి మామిడి తోటలు నాశనమవుతున్నాయన్నారు. తక్షణమే అధికా రులు స్పందించి రైతుల సమస్యను పరిష్కారం చేయాలని, లేకుంటే ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. పార్టీ జిల్లా కమిటీ సభ్యులు అడిగర్ల రాజు, బీఎస్పీ నాయకుడు బొట్టా నాగరాజు, రైతులు అప్పారావు, లోవరాజు తదితరులు పాల్గొన్నారు.

● ఎన్నాళ్లీ కష్టాలు?

చావైనా.. బతుకైనా..

ఉరకగెడ్డ దాటాల్సిందే..

- వర్షం వస్తే ఏడు ఆదివాసీ గ్రామాలు దిగ్బంధం
- తాచేరు గెడ్డపై తాత్కాలికంగా కర్రల వంతెన నిర్మాణం
- ఈ వంతెన నుంచే జారిపడి ఇటీవల మహిళ మృతి
- వంతెన నిర్మాణానికి రూ.7.20 కోట్లు మంజూరు చేసిన గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం
- ఎన్నికల కోడ్‌తో ఆగిన పనులు
- కూటమి సర్కార్ వచ్చి ఏడాదిన్నర కావస్తున్నా పట్టించుకోని వైనం

తాచేరు గెడ్డపై నిర్మించిన కర్రల వంతెన





కొత్తవలస వద్ద ఉరకగెడ్డలో ఈదుకుంటూ ఒడ్డుకు వస్తున్న యువకుడు

మాడుగుల:

మండలంలోని శంకరం పం చాయతీలో ఏడు గిరిజన గ్రామాలకు వర్షా కాలం వస్తే గండమే. బయటి ప్రాంతాలకు వెళ్లాల్సి వస్తే వారి బతుకు నరకమే. ఎన్నో ఏళ్ల నుంచి ఇదే దుస్థితి. ఈ గిరిజనులు మం డల కేంద్రానికి రావాలన్నా, నిత్యావసర సరు కులు కొనుగోలు చేయాలన్నా ఉరకగెడ్డ దాటవలసిందే. చిన్నపాటి వర్షం కురిసినా సరే గెడ్డ దాటలేని పరిస్థితులున్నాయి. అత్యవసర సమ యాలలో గెడ్డ దాటాలంటే ప్రాణాలు గుప్పెట పెట్టుకుని ఈదవలసిందే. వైఎస్సార్ సీపీ హయాంలో ఈ గిరిజన గ్రామాలకు రహదారితోపాటు ఈ గెడ్డపై వంతెన నిర్మాణానికి రూ.7.20 కోట్లు మంజూర య్యాయి. కొంత రోడ్డు పనులు కూడా జరిగాయి. ఈలోగా ఎన్నికల కోడ్ రావడంతో పనులు సాగలేదు. కూటమి ప్రభుత్వం వచ్చి ఏడాదిన్నర దాటిపోతున్నా ఈ వంతెన ఊసెత్తలేదని ఆదివాసీ గిరిజనులు ఆవేదన చెందుతున్నారు.

వారం రోజుల క్రితం అజయ్‌పురం గ్రామానికి చెందిన మాచమ్మ.. తాచేరు గెడ్డ కర్రల వంతెనపై కూలి పనికి వెళుతూ అదుపు తప్పి గెడ్డలో పడిపోయింది. ఈ దుర్ఘటనలో ప్రాణాలు కోల్పోయిన ఆమె మృతదేహాన్ని తిరిగి గ్రామానికి తీసుకురావడానికి అదే కర్రల వంతెనపై అష్టకష్టా లు పడాల్సి వచ్చింది. హృదయం ద్రవించి పోయే ఈ దుర్ఘటన నేపథ్యం ఏడు గిరిజన గ్రామాలతో ముడిపడి ఉంది.

కర్రల వంతెనపై ప్రమాదకర ప్రయాణం

తాటిపర్తి పంచాయతీ అజయ్‌పురం వద్ద కొండగె డ్డపై తాత్కాలికంగా కర్రల వంతెన నిర్మాణం చేప ట్టారు. ఈ వంతెనపై ప్రయాణించేటప్పుడు అదుపు తప్పితే ప్రాణాలు నీటిలో కలసి పోతున్నాయి. రెం



ఉరకగెడ్డపై వంతెన నిర్మించాలని గెడ్డలోకి దిగి ఆందోళన చేస్తున్న గిరిజనులు

డు నెలల క్రితం సీపీఎం నాయకుల ఆధ్వర్యంలో ఉరకగెడ్డపై వంతెన నిర్మాణం చేపట్టాలని ఆదివాసీ గిరిజనులు గెడ్డలో దిగి ఆందోళన చేపట్టారు. అయినా సరే కూటమి సర్కారులో ఎటువంటి స్పం దన లేదని ఆదివాసీ గిరిజనులు ఆవేదన చెందుతు న్నారు. సంబంధిత అధికారులు స్పందించి రాయిపాలెం, రాజంపేట, వెలగలపాడు, కొత్తవ లస, మామిడిపాలెం, తాడివలస, గొప్పూరు, గిరి గ్రామాలకు రహదారి సౌకర్యం కల్పించాలని కోరుతున్నారు.

వంతెన నిర్మాణం చేపట్టాలి



శంకరం పంచాయతీలో ఏడు గిరిజన గ్రామాల చుట్టూరా ఉరకగెడ్డ ప్రవహిస్తోంది. వర్షా కాలంలో గెడ్డ దాటలేని పరిస్థి తులున్నాయి. మా పూర్వీకుల నుంచి ఇదే పరి స్థితి. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో కొంత వరకు రోడ్డు నిర్మాణ పనులు జరిగాయి. వంతెన నిర్మాణం చేపట్టడానికి సిద్ధమవుతున్న సమయం లో ఎన్నికల కోడ్ రావడంతో ఆ పనులు నిలిచిపో యాయి. కూటమి సర్కారు వచ్చి ఏడాదిన్నర పూర్తవుతున్నా వంతెన ఊసెత్తలేదు. పలుసార్లు సీపీఎం నాయకులతో కలసి నిరసనలు వ్యక్తం చేసినా సరే పట్టించుకోలేదు. గర్భిణులను వర్షా కాలంలో గెడ్డ దాటించడం కష్టంగా ఉంది.

–శోలం రమేష్, గిరిజన సంఘ నాయకుడు, కొత్తవలస

ఓపెన్ స్కూల్ ద్వారా నేరుగా టెన్త్, ఇంటర్ ప్రవేశాలు

- 15 తేదీ వరకు దరఖాస్తు గడువు

అనకాపల్లి టౌన్ :

ఆంధ్రప్రదేశ్ సార్వత్రిక విద్యాపీఠం ద్వారా దూర విద్యా విధానంలో నేరుగా 10వ తరగతి, ఇం టర్మీడియట్ చదువుకునే అవకాశాన్ని ఆసక్తి గల వారందరూ సద్వినియోగం చేసుకోవాలని జిల్లా విద్యాశాఖాధికారి గిడ్డి అప్పారావు నాయుడు తెలిపారు. ఆంధ్రప్రదేశ్ సార్వత్రిక విద్యాపీఠం ఏపీ ఓపెన్ స్కూల్‌లో 2025–26 విద్యా సంవత్స రంలో చేరాలని అనుకునే వారు సాధారణ అపరాధ రుసుముతో ఈ నెల 15వ తేదీలోగా ఆన్‌లైన్ ద్వారా, ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల ద్వారా వెంటనే నమోదు కావాలన్నారు. 14 ఏళ్లు నిండిన వారంతా సంబంధిత కేంద్రాల ద్వారా నేరుగా పదో తరగతిలో చేరి సెలవు దినాల్లో శిక్షణ పొంది పరీ క్షలు రాసి ఉత్తీర్ణులు కావచ్చన్నారు. పదో తరగతి ఉత్తీర్ణత సాధించి కళాశాలలో చేరకుండా ఉం డిపోయినా, చేరి మధ్యలో మానేసినా వారు ఇప్పుడు నేరుగా ఆసక్తి ఉన్న సబ్జెక్టులతో ఇంటర్మీడి యట్ కోర్సుల్లో చేరవచ్చన్నారు. చేరిన వారికి ఉచి తంగా పాఠ్యపుస్తకాలు, సులభతరమైన స్వీయ అభ్యసన సామాగ్రిని నేరుగా అభ్యాసకుల ఇంటికే పంపించడం జరుగుతుందన్నారు.

ఓపెన్ స్కూల్ వెబ్‌సైట్‌ల ద్వారా సంబంధిత సబ్జెక్టుల పాఠ్యాంశాలు, పరీక్షల విధి విధానాలు నమూనా ప్రశ్న పత్రాలు తదితర పూర్తి సమాచారం తెలుసుకోవచ్చన్నారు. గతంలో పదో తరగతి, ఇం టర్మీడియట్ కోర్సుల్లో ఫెయిల్ అయినప్పటికీ ఆయా పరీక్షల్లో పాసైన సబ్జెక్టుల మార్కులను కూడా ఓపెన్ స్కూల్‌కు బదలాయించుకునే అవ కాశం ఉందన్నారు.

అన్ని రాష్ట్రాల బోర్డుల పరీక్షల ఫలితాల ధ్రువ పత్రాలతో సమానంగా ఏపీ సార్వత్రిక విద్యాపీఠం పరీక్షల ఫలితాల ధ్రువ పత్రాలకు సమాన గుర్తింపు ఉందన్నారు. ఇంటర్నెట్, ఏపీ ఆన్‌లైన్, గ్రామ, వార్డు సచివాలయాల ద్వారా కూడా ప్రవేశం పొం దవచ్చన్నారు. ప్రవేశ రుసుము చెల్లింపులో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, దివ్యాంగులు, మహిళలు, ట్రాన్స్ జెండర్లు, మాజీ సైనిక ఉద్యోగులకు రాయితీ ఉందన్నారు. పూర్తి సమాచారాన్ని జిల్లా, మండల విద్యాశాఖాధికారి కార్యాల యాలలో కూడా సంప్రదించవచ్చని డీఈవో వివరించారు.

ఈ రోడ్డుపై ప్రయాణం ఎలా మహాప్రభో?



బురదలో కూర్చొని నిరసన తెలుపుతున్న గిరిజనులు

రావికమతం: చినపాచిలి నుంచి టి.అర్జాపురం వర కు బీఎస్ రోడ్డు పనులు పూర్తి చేయాలని బురదలో కూర్చొని గిరిజనులు బుధవారం నిరసన తెలి పారు. కె.కొట్నాబిల్లి, గదపపాలెం, రామన్నదొర పాలెం, డోలవానిపాలెం, ఎర్రబంద గ్రామాల వారు ఏ అవసరం వచ్చినా ఈ రోడ్డు మీదుగా ప్రయాణం చేయాలి. టి.అర్జాపురం నుంచి మాడు గుల వెళ్లే ప్రజలు కూడా దగ్గరగా ఉంటుందని ఈ రోడ్డునే ఆశ్రయిస్తారు. వైఎస్సార్ సీపీ ప్ర భుత్వం 2023 అక్టోబర్ నెలలో హై ఇంపాక్ట్ రోడ్డు నిధులు మంజూరు చేసింది. రూ.6.98 కోట్లతో 14 కిలోమీటర్ల మేర రోడ్డు నిర్మించేందుకు 2024 జన వరిలో పనులు మొదలుపెట్టారు. తరువాత ఎలక్షన్ కోడ్ రావడంతో పనులు నిలిచిపోయాయి. కూటమి ప్రభుత్వం వచ్చాక రోడ్డు పనులు కొనసా గలేదు. కాంట్రాక్టర్‌ను ప్రశ్నించగా.. బిల్లులు అంద లేదని, అందువల్లనే పనులు నిలిపివేసినట్లు తెలిపారని గిరిజనులు పేర్కొన్నారు. రోడ్డు పనులు తక్షణమే చేయాలని, లేకపోతే భారీ ఎత్తున ఆం దోళన చేస్తామని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యులు కె.గోవిందరావు, గిరిజన సంఘం నాయకులు పాడి బెన్నయ్య, ఎస్.వలసయ్య డిమాండ్ చేశారు.

ఆటోలో...రక్తపు మడుగులో...

- అడ్డూరు సమీపంలో ఢీకొన్న ఆర్టీసీ బస్సు
- ఆటో డ్రైవర్ మృతి.. ఆటోలోని నలుగురికి తీవ్ర గాయాలు
- ఒకరి పరిస్థితి విషమం
- సహాయం అందక గంటపాటు విలవిల
- క్షతగాత్రులంతా ఒకే కుటుంబానికి చెందినవారు
- పెద్దకర్మకు వెళ్లి తిరిగివస్తుండగా ప్రమాదం



ప్రమాదంలో నుజ్జునుజ్జయిన ఆటో.. అందులో చిక్కుకొని తలకిందులుగా వేలాడుతున్న డ్రైవర్ మృతదేహం (ఇన్‌సెట్) మృతి చెందిన ఆటో డ్రైవర్ భూషణం

చోడవరం: వెంకన్నపాలెం–సబ్బవరం రోడ్డులో అడ్డూరు సమీపంలో బుధవారం ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో ఒకరు అక్కడి కక్కడే మృతి చెందగా నలుగురు తీవ్రంగా గాయ పడ్డారు. తెనుగుపూడి నుంచి గాజువాక వెళుతున్న ఆటోను ఎదురుగా వస్తున్న ఆర్టీసీ బస్సు ఢీ కొనడం తో ఈ ప్రమాదం జరిగింది. బస్సు అతి వేగంగా వెళుతూ ఆటోను ఢీకొట్టడంతో ఆటో డ్రైవర్ కురుచా భూషణం అక్కడికక్కడే మృతి చెందారు. ఈ ప్రమా దంలో చిక్కుకున్న వారంతా ఒకే కుటుంబానికి చెం దినవారు. వివరాల్లోకి వెళితే... చీడికాడ మండలం జైతవరం గ్రామానికి చెందిన కురచా భూషణం, కురచా నాయుడు, కురచా వరాహమూర్తి, మతల వరాహమూర్తి, కురచా శంకర్ జీవనోపాధి రీత్యా గత కొంతకాలంగా గాజువాకలో నివాసం ఉంటు న్నారు. దేవరాపల్లి మండలం తెనుగుపూడి గ్రామం లో తమ బంధువుల ఇంట్లో జరిగిన పెద్దకర్మ కార్యక్ర మానికి భూషణం ఆటోలో వీరంతా మంగళవారం ఉదయం బయలుదేరి వెళ్లారు. మధ్యాహ్నం తిరిగి వస్తుండగా వెంకన్నపాలెం–సబ్బవరం రోడ్డులో అడ్డూరుకు సమీపంలో ఎదురుగా వేగంగా వస్తున్న ఆర్టీసీ బస్సు ఢీకొట్టింది. దీంతో వీరు ప్రయాణిస్తున్న ఆటో నుజ్జునుజ్జయింది. ఆటో డ్రైవర్ భూషణం అక్కడికక్కడే మృతి చెందగా మిగతా నలుగురికి తీవ్ర గాయాలయ్యారు. వీరిలో కురచా శంకర్ పరిస్థితి విషమంగా ఉంది. క్షతగాత్రులను అనకాప ల్లి ఎన్టీఆర్ ఆస్పత్రికి తరలించగా అక్కడ ప్రాథమిక చికిత్స అనంతరం విశాఖపట్నం కేజీహెచ్‌కు తీసుకు వెళ్లారు. మృతుడు భూషణానికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. క్షతగాత్రుల్లో కురచానాయుడు విశాఖ డెయిరీలో వెటర్నరీ అసిస్టెంట్‌గా పనిచేస్తుం డగా మిగతా వారు ఎస్ఆర్ఎంటీలో పనిచేస్తున్నారు. వీరి తల్లిదండ్రులు స్వగ్రామమైన జైతవరంలో ఉం టుండగా భార్యా పిల్లలతో కలిసి వీరంతా గాజువా



తీవ్ర గాయాలతో క్షతగాత్రులు

కలో నివాసం ఉంటున్నారు. ప్రమాదవార్త తెలిసిన వెంటనే జైతవరం గ్రామంలో తీవ్ర విషాదం అలు ముకుంది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తు న్నట్టు సీఐ అప్పలరాజు చెప్పారు.

గంటపాటు రోడ్డుపైనే రక్తపు మడుగులో క్షతగాత్రులు

108 అంబులెన్స్ రాకపోవడంతో సుమారు గంటపాటు క్షతగాత్రు లంతా రక్తపు మడుగులోనే ప్రాణా పాయంతో కొట్టుమిట్టాడారు. బస్సు ఢీకొనడంతో ఆటో ముం దుభాగం పూర్తిగా ధ్వంసమై ఆటోలో కూర్చొని గాయాలపాలైన వారంతా బయటకు రాలేని పరిస్థితి నెలకొంది. అటుగా వెళుతున్న వారంతా సహాయం చేసేందుకు ప్రయత్నిం చినప్పటికీ తీవ్ర రక్తస్రావంతో క్షత గాత్రులంతా ఉండటం వల్ల సాధ్యం కాలేదు. దీంతో తీవ్ర రోదనల మధ్య క్షతగాత్రులంతా రక్తపు మడుగులోనే గంటపాటు ఉండిపోయారు. వైద్యం ఆలస్యం కావడం వల్లే తలకు బలమైన గాయమై ఎక్కువ రక్తం పోయిన కురచా శంకర్ అప స్మారక స్థితిలోకి వెళ్లిపోయారని అక్కడి వారంతా ఆం దోళన వ్యక్తం చేశారు.

సకాలంలో స్పందించిన చోడవరం పోలీసులు

ఫోన్ చేసి గంట అయినా 108 అంబులెన్స్ రాకపోవ డంతో కొందరు చోడవరం పోలీసు సర్కిల్ ఇన్‌స్పె క్టర్ అప్పలరాజుకు ఫోన్ చేశారు. ఆయన వెంటనే స్పందించి హుటాహుటిన జీపులో ఎస్ఐతోపాటు సిబ్బందిని ప్రమాద స్థలానికి పంపారు. వారు రక్తపు మడుగులో కొట్టుమిట్టాడుతున్న క్షతగాత్రులను వెంటనే ఆస్పత్రికి తరలించారు.

అందుబాటులో లేని 108 అంబులెన్స్

ఒకప్పుడు ఫోన్ కొట్టిన 20 నిమిషాల్లోనే ప్రమాద స్థలానికి చేరుకునే 108 అం బులెన్సులు ఇప్పుడు గంటలు గడిచినా రావడం లేదు. దీంతో సకా లంలో వైద్యం అందక అనేకమంది క్షతగా త్రులు మృత్యువాత పడుతున్నారు. ఇదే పరిస్థితి అడ్డూరు సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో క్షతగాత్రులకు ఎదురైం ది. ఆటోను ఆర్టీసీ బస్సు ఢీకొట్టి గంటసేపయినా ఒక్క 108 అం బులెన్స్ కూడా ప్రమాదస్థలానికి రాలేదు. అక్కడ ఉన్న వారంతా ఎవరికి వారు 108 కాల్‌సెంటర్‌కు ఫోన్ చేసి ప్రమాద విషయం చెప్పినా అంబులెన్స్ మాత్రం రాలేదు. గ్రామీణ జిల్లాలో చోడవరం, మాడుగుల, అనకాపల్లి, సబ్బవరం ప్రాంతాల్లో ఉన్న 108 అంబులె న్సులన్నీ విశాఖపట్నం రిఫరల్ కేసులు తీసుకెళ్తున్నాయని, అందుకే కొంత ఆలస్యమవుతుందని కాల్‌సెంటర్ నుంచి సమాధానం రావ డంతో జనం ఆగ్రహం వ్యక్తం చేశారు.

రోడ్డెక్కిన ఆటో డ్రైవర్లు



నక్కపల్లి జాతీయ రహదారిపై ఆటోలతో ర్యాలీ

- మహిళలకు ఉచిత బస్సు పథకంతో తమ పొట్ట కొట్టారని ఆవేదన
- జాతీయ రహదారిపై ఖాళీ ఆటోలతో ర్యాలీ

నక్కపల్లి: ఆటో డ్రైవర్లు రోడ్డెక్కారు. మహిళలకు ఉచిత బస్సు పథకాన్ని రద్దు చేయాలంటూ నక్కప ల్లికి చెందిన వీరవెంకట రాజేశ్వరి ఆటో యూనియన్ ఆధ్వర్యంలో ఖాళీ ఆటోలతో జాతీయ రహదారిపై ర్యాలీ నిర్వహించారు. ఈ పథకం తమ ఉపాధిని దెబ్బ తీసిందని, బేరాలు లేక పస్తులుండాల్సిన పరిస్థితి ఏర్పడిందంటూ వారు ఆందోళన బాట పట్టారు. నక్కపల్లి జాతీయ రహదారిపై వారపు సం త నుంచి వెదుళ్లపాలెం జంక్షన్, అక్కడ నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు సుమారు 5 కిలోమీ టర్ల మేర ఖాళీ ఆటోలతో ర్యాలీ చేశారు. ఆటో వాలాల ఆందోళనకు వైఎస్సార్‌సీపీ, సీపీఎం, సీఐ టీయూ నాయకులు సంఘీభావం ప్రకటించారు. ఉచిత బస్సు పథకం వల్ల ఆటోలకు బేరాలకు లేక నక్కపల్లి ఉపమాక రోడ్డు, ఆర్టీసీ కాంప్లెక్స్ జంక్షన్, వారపు సంత, రాజయ్యపేట ఆటో స్టాండ్‌ల వద్ద రోజంతా ఖాళీగా ఉండాల్సిన దుస్థితి ఏర్పడిందం టూ డ్రైవర్లు వాపోయారు. ఆటోలపై ఆధారపడ్డ మెకానిక్‌లు, సర్వీసింగ్ చేసేవారు, మొబైల్ రంగంలో పనిచేసేవారు సైతం ఉపాధి కోల్పోయారన్నారు. లక్షలాది రూపాయలు వెచ్చించి ఆటోలు కొనుగోలు చేసిన వారు ఉచిత బస్సు కారణంగా ప్రైవేటు ఫైనాన్స్ వారి వద్ద తెచ్చిన అప్పులు చెల్లించలేక



తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న ఆటో డ్రైవర్లు, నాయకులు

చాలా ఇబ్బందులు పడుతున్నారన్నారు. కాపు కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ వీసం రామకృష్ణ మాట్లాడుతూ గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఆటో డ్రైవర్లకు 'వాహనమిత్ర' పథకం కింద ప్రతి ఏటా రూ.10 వేల చొప్పున ఆర్థిక సాయం అందించిందని గుర్తు చేశారు. ఈ ప్రభుత్వం ఆర్థిక సాయం చేయక పోగా ఉన్న ఉపాధిని దెబ్బ తీసిందన్నారు. సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు ఎం.అప్పలరాజు మాట్లా డుతూ ఆటో డ్రైవర్లు బేరాలు లేక కుటుంబ జీవ నానికి సైతం అల్లాడుతున్నారన్నారు. ప్రభుత్వం స్పందించి ఉచిత బస్సు పథకాన్ని రద్దు చేయాలని, కాని పక్షంలో ప్రతి నెలా ఆటో డ్రైవర్లకు ఆర్థిక సాయం అందజేయాలని డిమాండ్ చేశారు. వాహన మిత్ర పథకం ద్వారా ప్రతి ఏటా ఆటో డ్రైవర్లకు రూ.30 వేల చొప్పున చెల్లించాలన్నారు. తహసీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించి, కొద్దిసేపు అక్కడ ఆందోళన చేశారు. అనంతరం తహసీల్దార్ నర్సింహమూర్తికి వినతి పత్రం అందజేశారు. వైస్ ఎంపీపీ వీసం నానాజీ, సీతంపాలెం ఎంపీటీసీ గొర్ల గోవిందు, ఆటో యూనియన్ నాయకులు శీరం సూకరాజు, దుర్గారావు, రాజు, తాతబాబు, కృష్ణ, నాయుడు పాల్గొన్నారు.

నేటి నుంచి ఉపాధ్యాయుల నిరసన వారం

బుచ్చెయ్యపేట/ఎస్.రాయవరం: ప్రభుత్వం ఉపాధ్యా యుల సమస్యలు పట్టించుకోకపోవడాన్ని నిరసిస్తూ గురువారం నుంచి నిరసన వారం చేపడుతున్నట్లు ఏపీ టీఎఫ్ జిల్లా శాఖ అధ్యక్ష, కార్యదర్శులు ధర్మారావు, దుర్గాప్రసాద్ తెలిపారు. బుధవారం వీరు విలేకరులతో మాట్లాడుతూ ఎన్నికల ముందు ఉపాధ్యాయుల సమ స్యలను పరిష్కరిస్తామని ప్రభుత్వం హామీ ఇచ్చింద న్నారు. గద్దె నెక్కి 15 నెలలైనా పరిష్కరించకపోవడం అన్యాయమన్నారు. ఈనెల 11వ తేదీ నుంచి 17 వరకు వారం రోజులపాటు రోజుకొక రీతిలో నిరసన తెలుపు తామన్నారు. పెండింగ్‌లో ఉన్న 4 డీఏలను తక్షణం విడుదల చేయాలని, సీపీఎస్‌ను రద్దు చేయాలని,1 2వ పీఆర్సీ కమిషన్‌ను నియమించాలని, ఈహెచ్ఎస్ పరి మితిని రూ.25 లక్షలకు పెంచాలని, ఇతర పనులు అప్పగించకుండా ఉపాధ్యాయులను బోధనకే వినియో గించాలని, 30 శాతం ఐఆర్ ఇవ్వడంలో ప్రభుత్వం కప్పదాటు వైఖరి మానుకోవాలని డిమాండ్ చేస్తూ నిర సన వారం చేపడతున్నామన్నారు. 11న నల్ల బ్యాడ్జీ లతో విధులకు హాజరు, 12న మండల కేంద్రాల్లో నిర సన, 13, 14 తేదీల్లో ప్రజాప్రతినిధులకు వినతి పత్రాలు అందజేత, 15న పాత తాలుకా కేంద్రాల వద్ద నిరసన, 16న జిల్లా కేంద్రాల్లో నిరసన, 17న ముఖ్య మంత్రి, సీఎస్‌లకు వాట్సాప్, ఈ మెయిల్ ద్వారా విన తులు పంపడం చేపడుతున్నామన్నారు.



ఏపీటీఎఫ్ జిల్లా శాఖ అధ్యక్ష, కార్యదర్శులు ధర్మారావు, దుర్గాప్రసాద్

పత్రికా స్వేచ్ఛకు భంగం



జర్నలిస్టులపై కేసులు నమోదు చేయడం సరికాదు. పత్రికల్లో ప్రచురితమైన వార్తలపై ఏవైనా అభ్యంతరాలు ఉంటే.. ప్రెస్ కౌన్సిల్ ఆఫ్ ఇండియాకు ఫిర్యాదు చేయవచ్చు లేదా పరువు నష్టం దావా వేయవచ్చు. అంతేగానీ పత్రికా స్వేచ్ఛకు భంగం కలిగించేలా కేసులు పెట్టడం ప్రజాస్వామ్యానికి తీవ్రమైన నష్టం. గతంలో ఎప్పుడూ కూడా ఈ విధంగా జర్నలిస్టులపై కేసులు నమోదు చేయలేదు. ఈ విధమైన వైఖరి వల్ల జర్నలిస్టులు సరైన వార్తలు పాఠకులకు అందించలేరు. వాస్తవాలను రాయడానికి, నిజానిజాలు వెల్లడించడానికి వెనుకంజ వేసే ప్రమాదం ఉంది. జర్నలిస్టుల స్వేచ్ఛకు ఇబ్బందులు కలగకుండా తగిన విధంగా ఆలోచన చేయాలి.

– గంట్ల శ్రీనుబాబు, జాతీయ జర్నలిస్టుల సంఘం కార్యదర్శి



సాక్షి ఎడిటర్‌పై వేధింపులు సరికాదు



సాక్షి కార్యాలయంపై పోలీసులు దాడులు చేయడం, తాజాగా ఎడిటర్ ఆర్.ధనుంజయరెడ్డిపై పలు సెక్షన్ల కింద కూటమి ప్రభుత్వం కేసులు నమోదు చేయడం కక్ష సాధింపులో ఓ భాగమే. ప్రెస్ కాన్ఫరెన్స్‌లో ఓ నేత మాట్లాడిన విషయాలను వార్తగా ప్రచురించడంపై కూడా కేసు పెట్టడం, నోటీసుల పేరిట వేధించడం సబబు కాదు. భారత రాజ్యాంగం జర్నలిస్టులకు కల్పించిన భావ ప్రకటన స్వేచ్ఛను అణచివేసే ప్రయత్నం చేయడం అప్రజాస్వామికం. అన్యాయాన్ని, అవినీతిని, ప్రజా సమస్యలను తన కలంతో వెలికితీయడమే జర్నలిస్టుల వృత్తి. అలాంటి పత్రికా స్వాతంత్ర్యాన్ని, జర్నలిస్టుల కలాన్ని పోలీసు కేసులతో నియంత్రించాలని చూస్తే అది చాలా పెద్ద పొరపాటు అవుతుంది. ఏదైనా వార్త అవాస్తవమని భావిస్తే, దానికి ప్రభుత్వం వివరణ కోరాలి. కానీ కేసులు నమోదు చేయడం సరైంది కాదు.

– సీహెచ్‌బీఎల్ స్వామి, ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర కార్యదర్శి, అనకాపల్లి జిల్లా

క్లుప్తంగా

లైంగిక దాడి దోషులను కఠినంగా శిక్షించాలి

- కూటమి పాలనలో మహిళలకు రక్షణ కరువు
- వైఎస్సార్‌సీపీ జోన్‌-1 మహిళా విభాగం వర్కింగ్ ప్రెసిడెంట్ ఈర్లె అనురాధ



దేవరాపల్లి: విశాఖపట్నం సీతమ్మధారలో మైనర్ బాలికపై లైంగిక దాడికి పాల్పడిన దోషులను కఠినంగా శిక్షించాలని వైఎస్సార్‌సీపీ జోన్‌-1 మహిళా విభాగం వర్కింగ్ ప్రెసిడెంట్ ఈర్లె అనురాధ డిమాండ్ చేశారు. దేవరాపల్లి మండలం తారువలో బుధవారం ఆమె స్థానిక విలేకర్లతో మాట్లాడారు. ఈ దారుణ ఘటనపై ప్రభుత్వం సమగ్ర విచారణ చేపట్టి దోషులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. బాధిత బాలికకు న్యాయం చేసి, అన్ని విధాలుగా ఆదుకోవాలని కోరారు. కూటమి పాలనలో మహిళలు, బాలికలకు రక్షణ కొరవడిందని విమర్శించారు. విచ్చలవిడిగా మద్యం విక్రయాలు జరపడంతో మహిళలు, మైనర్ బాలికలపై అఘాయిత్యాలు రోజురోజుకు ఎక్కువయ్యాయని ఆమె ఆరోపించారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా కఠిన చర్యలు తీసుకోవాలని అనురాధ కోరారు.

23 నుంచి సింహగిరిపై శరన్నవరాత్రి ఉత్సవాలు



సింహాచలం: ఈ నెల 23 నుంచి అక్టోబరు 1 వరకు సింహగిరిపై శరన్నవరాత్రి ఉత్సవాలను వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు సింహాచలం దేవస్థానం ఈవో వి.త్రినాథరావు బుధవారం తెలిపారు. ఉత్సవాల్లో భాగంగా ప్రతిరోజూ ఆలయంలో శ్రీ రామాయణ నవరాత్ర పారాయణం ఉంటుందన్నారు. రోజూ సాయంత్రం 5 గంటలకు చతుర్భుజ తాయారు, సువర్ణ అమ్మవార్లకు ఆలయ బేడామండపంలో తిరువీధి నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఈ నెల 27న సింహవల్లీ తాయారు సన్నిధిలో వీరలక్ష్మీ ఆరాధనం, 29న మూల నక్షత్రం పురస్కరించుకుని ఆయుధపూజ నిర్వహిస్తామన్నారు. అక్టోబరు 2 విజయదశమి నాడు కొండదిగువ పూలతోటలో సాయంత్రం నుంచి జమ్మివేట ఉత్సవం, శమీపూజ జరపనున్నట్లు తెలిపారు. ఆ రోజు స్వామివారి ఉత్సవమూర్తి గోవిందరాజస్వామికి శ్రీరామాలంకారం చేసి కొండపైనుంచి మెట్ల మార్గంలో కొండ దిగువ పూలతోటకు తీసుకెళ్తామన్నారు. విజయదశమి నాడు సాయంత్రం 6 గంటల వరకు మాత్రమే సింహగిరిపై స్వామివారి దర్శనాలు లభిస్తాయన్నారు.

పెట్రోలింగ్ బైకులు.. రయ్.. రయ్



యలమంచిలి పట్టణ ఠాణాకు ఇచ్చిన కొత్త బైక్

- పోలీసుల చేతికి అధునాతన వాహనాలు
- ట్రాఫిక్ సమస్యకు చెక్ పెట్టేందుకు కృషి
- పరవాడ సబ్ డివిజన్‌కు 5 ద్విచక్ర వాహనాలు

యలమంచిలి రూరల్: భారీగా పెరుగుతున్న వాహనాలతో ట్రాఫిక్ పెద్ద సమస్యగా మారింది. ప్రధాన, అంతర్గత రహదారుల్లో ఎక్కడైనా ట్రాఫిక్ స్తంభిస్తే వెంటనే అక్కడకు చేరుకుని క్రమబద్ధీకరించేందుకు పోలీసులకు సవాలుగా తయారైంది. మరోవైపు గొడవలు, అల్లర్లు, ఘర్షణలు జరిగినప్పుడు అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా నివారించడం పోలీసులకు కత్తి మీద సాములా పరిణమించింది. వీటన్నింటికీ చెక్ పెట్టేలా పోలీసు శాఖ పలు ఠాణాలకు అన్ని సౌకర్యాలతో కొత్త ద్విచక్ర వాహనాలను అందజేసింది. పరవాడ పోలీసు సబ్ డివిజన్ పరిధిలో 5 పోలీస్ స్టేషన్లకు పెట్రోలింగ్ బైకులను కేటాయించారు. యలమంచిలి పట్టణం, యలమంచిలి ట్రాఫిక్, అచ్యుతాపురం, పరవాడ, సబ్బవరం ఠాణాలకు కేటాయించిన ఈ సరికొత్త వాహనాలు సంబంధిత సిబ్బందికి విధి నిర్వహణలో చాలా సౌకర్యవంతంగా, ఉపయుక్తంగా ఉన్నాయి.

ఇటీవల ఆయా ఠాణాలకు అందజేసిన టీవీఎస్ అపాచీ బ్రాండ్‌కు చెందిన ఈ బైకులకు అనేక ప్రత్యేకతలున్నాయి. ట్రాఫిక్ స్తంభించిన సమయాల్లో, ఏవైనా రోడ్డు ప్రమాదాలు జరిగిన సమయంలో వేగంగా ఘటనాస్థలికి చేరుకుని, వాహనాల రద్దీని క్లియర్ చేయడానికి కొత్త వాహనాలు ఉపయోగపడుతున్నాయి.



ప్రాథమిక వైద్య చికిత్స పరికరాలు, శ్వాస పరీక్ష పరికరాల పెట్టె



ఎర్ర బల్బు

ప్రత్యేకతలు

- బైక్‌కు వెనుక భాగాన ఎర్రటి బుగ్గ బల్బు, బ్లూ, ఎర్ర రంగు లైట్లు ప్రకాశవంతంగా వెలుగుతాయి. వాటి పక్కన మైక్‌లు ఉన్నాయి. అదే క్రమంలో సైరన్ కూడా మోగుతుంది. ట్రాఫిక్ సమస్య తలెత్తినప్పుడు మైక్ ద్వారా సూచనలు చెబుతూ పోలీసులు పరిస్థితిని క్రమబద్ధీకరిస్తున్నారు.
- ప్రమాదాలు జరిగిన ప్రాంతంలోనే బైక్‌ను నిలిపి ప్రజలను అప్రమత్తం చేయవచ్చు.
- ఊరేగింపులు, ర్యాలీల సమయంలో ప్రజలు ఇబ్బంది పడకుండా ఏయే మార్గాల్లో వెళ్లాలో మైకుల ద్వారా ఎక్కడికక్కడ హెచ్చరికలు జారీ చేయొచ్చు.
- ఎక్కడైనా ట్రాఫిక్ నిలిచిపోయి డయల్ 112కు ఫిర్యాదు వస్తే వెంటనే పోలీసులు ఆ ప్రాంతానికి చేరుకుంటారు.
- పోలీసు జీపులు, పెద్ద వాహనాలు చిన్నపాటి సందుల్లో వెళ్లలేవు కాబట్టి ఈ ద్విచక్ర వాహనాలతో సులువుగా ఘటనా స్థలానికి చేరుకోవచ్చు.
- రోడ్డు ప్రమాదాల సమయంలో క్షతగాత్రులను ద్విచక్ర వాహనంపై కూర్చోబెట్టుకుని ఆస్పత్రికి తరలించే అవకాశం ఉంది.
- వాహనంలో ప్రాథమిక చికిత్స అందించేందుకు అవసరమైన మందులు, పరికరాలతో పాటు మద్యం తాగి వాహనాలు నడిపేవారిని గుర్తించేందుకు శ్వాస పరీక్షలు చేసే పరికరం కలిగిన పెట్టె కూడా ఉంది.



యలమంచిలి ప్రధాన రహదారిపై కొత్త వాహనంతో ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరిస్తూ..

పెట్రోలింగ్‌కు బాగా ఉపయోగం



ఈ వాహనాలు నిరంతరం పెట్రోలింగ్ నిర్వహించడానికి బాగా ఉపయోగపడుతున్నాయి. గస్తీ సులభంగా ఉంటోంది. ఈ వాహనాల్లో ఇన్‌బిల్ట్ సైరన్ ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించేందుకు, అల్లర్లకు పాల్పడే వారిని చెదరగొట్టేందుకు ఉపయోగించుకోవచ్చు. తొలి విడతలో 5 పోలీస్ స్టేషన్లకు ఇచ్చాం. మరిన్ని వాహనాలు వచ్చే అవకాశం ఉంది. అన్ని ఠాణాలకు సమకూర్చితే సంబంధిత సిబ్బందికి సౌకర్యవంతంగా ఉంటుంది.

– వి.విష్ణుస్వరూప్, డీఎస్పీ, పరవాడ

మెడికల్ కళాశాలలను ప్రైవేటుపరం చేయొద్దు

- మాట్లాడుతున్న సీపీఎం జిల్లా కార్యదర్శి జి.కోటేశ్వరరావు



అనకాపల్లి: నర్సీపట్నం(మాకవరపాలెం) సహా రాష్ట్రంలోని పది కొత్త మెడికల్ కళాశాలలను పబ్లిక్ ప్రైవేట్ పార్టనర్‌షిప్(పీపీపీ) విధానంలో నిర్మించాలని విడుదల చేసిన జీవో నంబర్ 590ను తక్షణమే ఉపసంహరించుకోవాలని సీపీఎం జిల్లా కార్యదర్శి జి.కోటేశ్వరరావు డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ప్రజా ప్రయోజనాలకు విరుద్ధంగా, ఆరోగ్య రంగాన్ని లాభాపేక్ష కోసం ప్రైవేట్ సంస్థలకు అప్పగించే నిర్ణయాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలన్నారు. మాకవరపాలెంలో మెడికల్ కాలేజీ భవన నిర్మాణాలు గత ప్రభుత్వ హయాంలోనే చివరి దశలో ఉన్నాయని, వీటిని పూర్తి చేసి వైద్య సేవలు వెంటనే ప్రారంభించే అవకాశం ఉందని చెప్పారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం 10 మెడికల్ కాలేజీలను పీపీపీ పేరుతో ప్రైవేటుపరం చేయాలనుకోవడం దుర్మార్గమన్నారు. ప్రభుత్వం ఆధ్వర్యంలో నిర్వహించే వైద్య కళాశాలలు ప్రతిభకు, సామాజిక న్యాయానికి పెద్దపీట వేస్తాయని, ప్రైవేట్ యాజమాన్యాలు సంపన్నులకే సీట్లు కేటాయిస్తాయని, వ్యాపార దృక్పథం పేద ప్రజలకు వైద్యం అందకుండా చేస్తుందన్నారు. వైద్య విద్య, ఆరోగ్యం ప్రజా హక్కులను లాభాల కోసం తాకట్టు పెట్టడం సరైన పద్ధతి కాదన్నారు. ఇప్పటికే ప్రైవేటు మెడికల్ కాలేజీల ఫీజుల భారం వల్ల పేద విద్యార్థులకు వైద్య విద్య అందని పరిస్థితి నెలకొందన్నారు. ప్రభుత్వమే కొత్త మెడికల్ కాలేజీలను పూర్తిగా నిర్మాణం చేపట్టి, ప్రజలకు వైద్యం అందుబాటులోకి తీసుకురావాలని ఆయన డిమాండ్ చేశారు.

డీఎస్సీలో ఎంపికైన అభ్యర్థులకు సన్మానం



కొత్త ఉపాధ్యాయులను సన్మానిస్తున్న ఎమ్మెల్సీ శ్రీనివాసులనాయుడు, పీఆర్‌టీయూ నాయకులు

నర్సీపట్నం: డీఎస్సీ–2025లో ఎంపికైన అభ్యర్థులను పీఆర్‌టీయూ ఆధ్వర్యంలో బుధవారం ఘనంగా సత్కరించారు. ముఖ్యఅతిథిగా ఎమ్మెల్సీ గాదె శ్రీనివాసులనాయుడు మాట్లాడుతూ విద్యార్థులను ప్రయోజకులను చేసే అవకాశాన్ని కొత్త ఉపాధ్యాయులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. అంకితభావంతో పని చేసి ఉపాధ్యాయ వృత్తికి గుర్తింపు తీసుకురావాలని ఆయన సూచించారు. అనంతరం ఉపాధ్యాయులుగా ఎంపికైన 200 మందిని సత్కరించి, జ్ఞాపికలు అందజేశారు. ఈ కార్యక్రమంలో పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు డి.గోపీనాథ్, యూనియన్ ప్రతినిధులు రమణ, అప్పారావు, ప్రసాద్, వరహాలనాయుడు, జి.వి.రమేష్, తదితరులు పాల్గొన్నారు.

మెట్ల పైనుంచి జారి పడి వృద్ధుడి మృతి

అనకాపల్లి టౌన్: మెట్ల పైనుంచి జారి పడి ఓ వృద్ధుడు మృతి చెందాడు. పట్టణ ఏఎస్‌ఐ బి.రామ్ కుమార్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. పట్టణంలోని కోట్ని వీధిలో నివాసముంటున్న కోరుకొండ సూర్యనారాయణ(70) తన ఇంటిలో మూడో అంతస్తులో నివాసముంటున్నాడు. ఈ నెల 9న అర్ధరాత్రి 11 గంటల సమయంలో మెట్ల పైనుంచి కిందకి దిగొస్తుండగా ప్రమాదవశాత్తు జారిపడి తీవ్ర గాయాల పాలయ్యాడు.

వెంటనే కేజీహెచ్‌కు తరలించగా బుధవారం అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడని ఏఎస్‌ఐ తెలిపారు. మృతుడి భార్య కోట్ని నారాయణమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.

దివ్యాంగుల పింఛన్లు రద్దు చేయొద్దు

- జెడ్పీ ఛైర్‌పర్సన్ సుభద్ర
- పంచాయతీరాజ్ అధికారుల తీరుపై జెడ్పీటీసీ సభ్యుల అసంతృప్తి

మహారాణిపేట (విశాఖ):

దివ్యాంగుల పింఛన్ల రీ వెరిఫికేషన్ చేసినప్పటికీ.. అర్హులైన వారందరికీ పింఛన్లు కొనసాగించాలని జిల్లా పరిషత్ ఛైర్‌పర్సన్ జె.సుభద్ర సూచించారు. జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో బుధవారం ఆమె అధ్యక్షతన పలు స్థాయీ సంఘాల సమావేశాలు జరిగాయి. ఈ సందర్భంగా పలువురు జెడ్పీటీసీ సభ్యులు మాట్లాడుతూ 40 శాతం లోపు వైకల్యం ఉందంటూ దివ్యాంగులకు నోటీసులు ఇచ్చి, సదరం సర్టిఫికెట్లను మళ్లీ వెరిఫికేషన్ చేస్తుండటంతో వారు ఆందోళన చెందుతున్నారన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చినప్పటి నుంచి దివ్యాంగుల పింఛన్ల విషయంలో పలు రకాలుగా వేధిస్తున్నారని, దీని వల్ల వారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆరోపించారు. దీనిపై స్పందించిన ఛైర్‌పర్సన్.. దివ్యాంగుల పింఛన్లను రద్దు చేయవద్దన్నారు. ఉద్యోగులు నిబద్ధతతో పనిచేయాలని, పంచాయతీల్లో ఆదాయం పెంచేందుకు చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. కాగా.. అనకాపల్లి జిల్లా, పరవాడ మండలంలోని పంచాయతీ రాజ్ అధికారుల పనితీరుపై జెడ్పీటీసీ సభ్యులు అసంతృప్తి వ్యక్తం చేశారు.

జేఈపై చర్యలు తీసుకోవాలి

పరవాడలో ఇప్పటికే సీసీ రోడ్లు ఉన్న చోట మళ్లీ కొత్త రోడ్ల కోసం ప్రతిపాదనలు చేయడం, వాటికి ఆమోదం తెలిపిన తర్వాత పనులు నిలుపుదల చేయడంపై పరవాడ జెడ్పీటీసీ సభ్యుడు పైలా సన్యాసిరాజు అభ్యంతరం తెలిపారు. ఈ విధంగా తప్పుడు ప్రతిపాదనలు చేసిన జేఈపై చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.



మాట్లాడుతున్న జెడ్పీ ఛైర్‌పర్సన్ సుభద్ర. చిత్రంలో సీఈవో నారాయణమూర్తి

ఆరోగ్యశ్రీ, కేజీహెచ్ సేవలపై అసంతృప్తి

కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ ఐ.వాణికి ఫోన్ చేస్తే స్పందించడం లేదని కె.కోటపాడు జెడ్పీటీసీ సభ్యురాలు ఈర్లె అనురాధ ఆరోపించారు. తాము సొంత పనుల కోసం ఫోన్ చేయమని, పేద రోగులకు వైద్యం కోసమే ఫోన్ చేస్తామని, అయినా అధికారి స్పందించకపోవడం దారుణమన్నారు. ఆరోగ్యశ్రీ పథకం సక్రమంగా అమలు కావడం లేదని, కార్పొరేట్ ఆస్పత్రుల్లో పేద రోగులకు వైద్య సేవలు అందేలా చూడాలని పలువురు జెడ్పీటీసీ సభ్యులు కోరారు. దీనిపై విశాఖ జిల్లా ఆరోగ్యశ్రీ కోఆర్డినేటర్ డాక్టర్ అప్పారావు స్పందిస్తూ.. ఆరోగ్యశ్రీ కింద 3,000కు పైగా ప్రొసీజర్లకు చికిత్స అందిస్తున్నామని, కార్డు ఉన్న వారందరికీ సేవలు అందుతున్నాయని తెలిపారు. కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ ఐ.వాణి మాట్లాడుతూ ఆసుపత్రిలో పూర్తి స్థాయి క్యాన్సర్ చికిత్స, గుండె ఆపరేషన్లు జరుగుతున్నాయని, వెంటిలేటర్లు కూడా అందుబాటులో ఉన్నాయని తెలిపారు.

అచ్చెన్న చెరువుపై చర్చ



మాట్లాడుతున్న కో ఆప్షన్ సభ్యుడు నర్మాల కుమార్

అచ్యుతాపురం మండలంలోని యర్రవరం గ్రామంలో సర్వే నెం.147 ప్రభుత్వ చెరువులో వారం రోజులుగా జరుగుతున్న చెరువు మట్టి అక్రమ తవ్వకాలపై కో ఆప్షన్ సభ్యుడు నర్మాల కుమార్ ధ్వజమెత్తారు. అధికార పార్టీ నాయకుల అండదండలతో యర్రవరం గ్రామంలో రెవెన్యూ అధికారులు తప్పుడు అనుమతులు ఇవ్వడంతో కోట్ల విలువైన ప్రభుత్వ చెరువు మట్టిని కూటమి నాయకులు సెజ్ పరిశ్రమలకు, వివిధ వ్యాపార సముదాయాలకు, ప్రైవేట్ లే-అవుట్‌లకు అక్రమంగా రవాణా చేస్తున్నారన్నారు. అక్రమార్కులకు సహకరిస్తున్న అధికారులపై చర్యలు తీసుకోవాలన్నారు.

పీఎం–సూర్య ఘర్‌పై అవగాహన

విద్యుత్ సమస్యల పరిష్కారం కోసం 1912 నంబర్‌కు ఫోన్ చేస్తే.. 4 గంటల్లోపు సమస్యను పరిష్కరిస్తామని విద్యుత్ శాఖ అధికారులు తెలిపారు. పీఎం–సూర్య ఘర్ పథకం ద్వారా ప్రజలు విద్యుత్ బిల్లుల భారం నుంచి ఉపశమనం పొందవచ్చన్నారు. జెడ్పీ సీఈవో పి. నారాయణమూర్తి, మూడు జిల్లాల అధికారులు, జెడ్పీటీసీ సభ్యులు పాల్గొన్నారు.

బైకుపై వెళుతూ ఆగిన బస్సును ఢీకొని..



మృతుడు కంచర్ల రామారావు

రావికమతం : మండలంలోని పిల్లవానిపాలెం దాటిన తరువాత గొంప దగ్గరలో బుధవారం సాయంత్రం ద్విచక్ర వాహనం (ఏపి 39 కువై 2649)పై వెళ్తూ ఆర్టీసీ బస్సు (ఏపి35 జెపి 0087)ను ఢీకొట్టి కంచర్ల రామారావు(70) అనే వ్యక్తి మృతి చెందాడు. రావికమతం ఎస్ఐ రఘువర్మ తెలిపిన వివరాలివి. బుచ్చెయ్యపేట మండలం పెదమదీన గ్రామానికి చెందిన కంచర్ల రామారావు బుధవారం సాయంత్రం గుడ్డిపలో వ్యవసాయ పనులు ముగించుకొని స్వగ్రామం పెదమదీనకు ద్విచక్ర వాహనంపై బయలు దేరాడు. అనకాపల్లి డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు ముందు వెళ్తూ ఆగింది. దీంతో బైకుపై వెనుకగా వస్తున్న రామారావు బస్సు వెనుక బలంగా ఢీకొన్నాడు. పెద్ద శబ్దం రావడంతో డ్రైవర్ బస్సు దిగివచ్చి చూడగా అప్పటికే రామారావు రోడ్డుపై పడి ఉన్నాడు. అతనిని వైద్యం కోసం రావికమతంలోని ప్రైవేటు అస్పత్రికి తీసుకురాగా అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడికి భార్య పార్వతి, వివాహితులైన కుమారుడు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు. మృతదేహన్ని పోస్టుమార్టం కోసం నర్సీపట్నం ఏరియా ఆస్పత్రికి తరలించారు. ఆర్టీసీ డ్రైవర్ , కండక్టర్‌లను అదుపులోనికి తీసుకొన్నట్టు ఎస్ఐ తెలిపారు. రామారావు మృతితో పెదమదినాలో విషాదఛాయలు అలముకున్నాయి.

కేజీహెచ్ వార్డు బాయ్‌పై చర్యలు

సాక్షి ఎఫెక్ట్..

మహారాణిపేట: 'సాక్షి'లో ప్రచురితమైన కథనానికి కేజీహెచ్ ఉన్నతాధికారులు చర్యలు చేపట్టారు. వైద్యురాలి పట్ల అసభ్యంగా ప్రవర్తించిన ఘటనపై రోజుల తరబడి నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించిన అధికారులు.. 'కేజీహెచ్‌లో కీచకులు' శీర్షికన బుధవారం 'సాక్షి'లో కథనం ప్రచురితం కావడంతో ఉలిక్కిపడి.. దిద్దుబాటు చర్యలకు ఉపక్రమించారు. ఈ వ్యవహారంలో ఆరోపణలు ఎదుర్కొంటున్న వార్డు బాయ్ శంకరరావును సస్పెండ్ చేస్తూ సూపరింటెండెంట్ డాక్టర్ ఐ.వాణి బుధవారం సాయంత్రం ఉత్తర్వులు జారీ చేశారు. గత నెల 26న గ్యాస్ట్రో ఎంట్రాలజీ వార్డులో మహిళా వైద్యురాలి పట్ల వార్డు బాయ్ శంకరరావు రెండుసార్లు అసభ్యకరంగా ప్రవర్తించారు. ఈ ఘటనపై తీవ్ర మనస్తాపానికి గురైన ఆమె అదే రోజు కేజీహెచ్ సూపరింటెండెంట్, ఏఎంసీ ప్రిన్సిపల్, విభాగాధిపతులతో పాటు వన్‌టౌన్ పోలీసులకు సైతం లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశారు. అయినప్పటికీ ఎటువంటి చర్యలు తీసుకోకపోవడంతో ఈ విషయంపై 'సాక్షి'దినపత్రికలో కథనం వెలువడింది. దీంతో కేజీహెచ్ యాజమాన్యం తర్జనభర్జనల అనంతరం చర్యలు తీసుకోవడానికి సిద్ధమైంది. వెంటనే సంబంధిత ఫైల్‌ను తయారుచేసి, శంకరరావును సస్పెండ్ చేస్తున్నట్లు ప్రకటించింది. మరోవైపు ఈ ఘటనపై నాల్గవ తరగతి ఉద్యోగ సంఘాలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి. ఉన్నతాధికారుల తీరును నిరసిస్తూ భవిష్యత్ కార్యాచరణపై చర్చించేందుకు త్వరలో సమావేశం కానున్నట్లు తెలిసింది. కాగా.. సర్జరీ విభాగంలో బాలిక తల్లి పట్ల ఓ వైద్యుడు అసభ్యకరంగా ప్రవర్తించినట్లు వచ్చిన ఫిర్యాదుపై కూడా ఆస్పత్రి ఉన్నతాధికారులు దృష్టి సారించారు. ఈ ఘటనపై మహిళా కమిషన్ నుంచి కేజీహెచ్‌కు వచ్చిన రెండు ఈ-మెయిల్స్‌ను ఎవరు డిలీట్ చేశారన్న దానిపై కూడా అంతర్గత విచారణ మొదలైనట్లు సమాచారం.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలు

మాడుగుల రూరల్: ఎదురెదురుగా ద్విచక్ర వాహనాలతో ఢీకొన్న ఘటనలో మండలంలో ఎం.కోడూరుకు చెందిన ఇద్దరు యువకులు తీవ్రంగా గాయపడ్డారు. వివరాలిలా ఉన్నాయి. బుధవారం ఉదయం ఎం.కోడూరు నుంచి మాడుగుల మధ్య రహదారిలో పిరమిడ్ ధ్యాన మందిరం సమీపంలో ఓరిపిల్లి శ్రీనివాసరావు, కింతాడ అప్పారావు, ఇరువురు ఎదురెదురుగా స్కూటీల మీద వస్తూ ఢీకొట్టుకున్నారు. తీవ్రంగా గాయపడిన ఇద్దర్నీ స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స అనంతరం మెరుగైన చికిత్స కోసం అనకాపల్లి ఏరియా ఆస్పత్రికి తీసుకెళ్లారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నేడు విశాఖకు నేపాల్‌లో చిక్కుకున్న తెలుగువారు

గోపాలపట్నం : నేపాల్‌లో చిక్కుకున్న తెలుగువారు గురువారం మధ్యాహ్నం ఇండిగో విమానంలో విశాఖ రానున్నారు. వీరిలో అధిక శాతం మంది ఉత్తరాంధ్ర వాసులు ఉన్నట్లుగా తెలుస్తోంది. వీరు మధ్యాహ్నం 3.30 గంటల సమయంలో విశాఖ చేరుకుంటారు.



వడ్డాదిలో పెద్దేరు వంతెనపై ఏర్పడ్డ గొయ్యి

ఉత్సాహంగా ఓనం సంబరాలు



ఓనం సంబరాల్లో పాల్గొన్న విద్యార్థులు, ఉపాధ్యాయులు

పాయకరావుపేట: ఓనం సంబరాలు శ్రీప్రకాష్ జూనియర్ కళాశాలలో బుధవారం ఘనంగా జరిగాయి. విద్యార్థినులు కేరళ సంప్రదాయ వస్త్రధారణతో ఆకట్టుకున్నారు. ప్రత్యేక పూజలు చేశారు. కేరళలో ప్రాచుర్యం పొందిన పాటలు పాడుతూ నృత్యం చేస్తూ సందడి చేశారు. ఓనం పండగ విశిష్టతను ఓ విద్యార్థిని చక్కగా వివరించి ఆకట్టుకుంది.

ఇటువంటి కార్యక్రమాలతో విద్యార్థులకు వివిధ రాష్ట్రాల ఆచార, వ్యవహారాలపై అవగాహన ఏర్పడి, మన దేశ భిన్నత్వంలో ఏకత్వానికి దోహదపడుతుందని ప్రిన్సిపాల్ భానుమూర్తి తెలిపారు.

వడ్డాదిలో వర్ష బీభత్సం

బుచ్చెయ్యపేట: మండలంలో బుధవారం వర్షం బీభత్సం సృష్టించింది. మేజర్ పంచాయతీ వడ్డాదిలో రెండిళ్లకు చెందిన ప్రహరీలు కూలిపోయాయి. సాయంత్రం వర్షం కురుస్తున్న సమయంలో బీఎస్ రోడ్డు వద్ద వేంకటేశ్వరస్వామి ఆర్చ్ దగ్గరలో చంద్రశేఖర్ ఇంటి ప్రహరీ కూలిపోయి పక్కనే ఉన్న సయ్యపురెడ్డి శ్రీను ఇంటి ప్రహరీపై పడింది. దీంతో ఆ గోడ కూడా కూలిపోయింది. ఆయా ఇళ్లల్లో ఎవరూ లేకపోవడంతో ప్రమాదం తప్పింది.

– వడ్డాది పెద్దేరు నది ఉధృతంగా ప్రవహిస్తుంది. నీటి ప్రవాహానికి నదిపై ఉన్న శిథిల వంతెనపై మళ్లీ రంధ్రం పడింది. గతంలో రంధ్రం పడి గొయ్యి పడటంతో ఆర్అండ్‌బీ అధికారులు గొయ్యిని పూడ్చారు. నీటి ఉధృతికి మళ్లీ వంతెన వద్ద గొయ్యి పడటంతో వాహనదారులు రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నారు. ప్రమాదాలు జరగకుండా స్థానికులు గొయ్యి చుట్టూ రాళ్లు పేర్చి హెచ్చరికలు జారీ చేశారు.



వడ్డాదిలో కూలిన ప్రహరీలు

క్లుప్తంగా

85 మందికి నేత్ర వైద్య పరీక్షలు



కంటి వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్

తుమ్మపాల: గ్రామీణ ప్రాంతాల్లో నిరుపేదలకు ఉచిత వైద్యసేవలు అందించాలన్న లక్ష్యంతో వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నట్టు అమ్మ ఆదరణ చారిటబుల్ ట్రస్ట్ నిర్వాహకులు పి.ఎస్. గంగాధర్, ఎం.రాజశేఖర్ తెలిపారు. గొలగాం పంచాయతీ ఎల్లారమ్మకాలనీలో బుధవారం శంకర్ ఫౌండేషన్, సిరి ఫస్ట్ ఎయిడ్ సెంటర్ ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. 85 మందికి కంటి పరీక్షలు చేసి, మందులు పంపిణీ చేశారు. వీరిలో 22 మందికి ఆపరేషన్లు నిర్వహించనున్నట్టు క్యాంప్ కోఆర్డినేటర్ అశ్విన్‌కుమార్ తెలిపారు.

విద్యార్థుల కోసం ఉపాధ్యాయురాలి వితరణ



కంప్యూటర్,ప్రింటర్ అందజేస్తున్న ఉపాధ్యాయురాలు హేమ కుమారి

కశింకోట: మాకవరపాలెం మండలం శెట్టిపాలెం ప్రాథమిక పాఠశాలలో విద్యార్థుల కోసం కశింకోట 4వ ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయురాలు హేమ కుమారి కంప్యూటర్, ప్రింటర్‌ను అందజేశారు. తన సొంత సొమ్ము రూ.70 వేలతో వీటిని సమకూర్చారు. హేమ కుమారికి సర్పంచ్ అల్లు రామునాయుడు అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం కె.వి.ఎల్. ప్రవీణ, ఉపాధ్యాయులు కరుణ, దేవి తదితరులు పాల్గొన్నారు.

నేడు దుర్గమాంబ పుట్టుక మహోత్సం



కశింకోట: స్థానిక గవరపేటలో ప్రసిద్ధి చెందిన దుర్గమాంబ అమ్మ వారి పుట్టుక మహోత్సవాన్ని గురువారం నిర్వహించనున్నట్టు ఉత్సవ కమిటీ అధ్యక్షుడు, వైఎస్సార్ సీపీ జిల్లా అధికార ప్రతినిధి మళ్ల బుల్లిబాబు తెలిపారు. పెద్ద గుమ్మంలో ఉన్న ఆలయం నుంచి మధ్యాహ్నం మూడు గంటలకు అమ్మ వారు వెలసి ఉన్న కనకమహాలక్ష్మి వీధిలోని పొలాల వద్దకు పల్లకితో ఊరేగింపుగా వెళ్లి పూజలు నిర్వహించనున్నట్లు తెలిపారు. అక్కడి నుంచి అమ్మ వారి ప్రతి రూపాన్ని, గరగలను పల్లకిలో నిలిపి గ్రామం అంతటా పలు సాంస్కృతిక కార్యక్రమాలతో ఊరేగించి, అమ్మ వారి దర్శనాన్ని ప్రజలకు కల్పించనున్నట్లు తెలిపారు. అనంతరం ఆలయంలో అమ్మ వారిని నిలిపి వారం రోజులపాటు పూజలు చేసి, ఈ నెల 18న అమ్మ వారి పండగను నిర్వహించనున్నట్టు ఆయన చెప్పారు.

బెల్లం ధరలు



అనకాపల్లి బెల్లం మార్కెట్‌కు బుధవారం 71 దిమ్మలు వచ్చాయి

దిమ్మల రకం	కనిష్ట ధర	గరిష్ట ధర
మొదటి రకం	4,580	4,900
రెండో రకం	3,800	4,030
మూడో రకం	3,700	3,700

అనకాపల్లి సినిమాలు

రాజా	: మదరాసి
సత్యనారాయణ స్క్రీన్-1	: కొత్తలోక
సత్యనారాయణ స్క్రీన్-2	: ది కన్జూరింగ్ 4 లాస్ట్ రైట్స్
పరిసాయి	: ఘాటీ
షిర్డీసాయి	: కూలీ
వెంకటేశ్వర	: లిటిల్ హార్ట్స్
రామచంద్ర	: వార్-2

రక్త నిల్వలు


అనకాపల్లి: ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 77 యూనిట్ల రక్తం నిల్వ ఉంది. ఎ పాజిటివ్-16, బి పాజిటివ్-22, ఒ పాజిటివ్-34, ఏబీ పాజిటివ్-5 యూనిట్ల శుద్ధిచేసిన రక్తం నిల్వ ఉంది. అవసరమైన వారు వైద్యాలయం బ్లడ్ బ్యాంక్ టెక్నీషియన్ యు.లోకేష్(ఫోన్ నంబర్.9703613706)ను సంప్రదించవచ్చు.

గ్యాస్ సమాచారం

అనకాపల్లి: ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా బుధవారం 349 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న వారిలో 296 మందికి సిలెండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ప్రతినిధి (ఫోన్ నంబర్.08924-223595)ని సంప్రదించవచ్చు.



బయ్యవరంలో పెద్ద చెరువు కింద వేసిన వరి నాట్లు



పెద్ద చెరువులో పుష్కలంగా చేరిన నీరు

చెరువు నిండుగా.. రైతన్నకు పండగ

• పెద్ద చెరువులోకి పుష్కలంగా చేరిన నీరు • ఆయకట్టు భూముల్లో నాట్లు పూర్తి

కశింకోట: మండలంలోని బయ్యవరం గ్రామం వద్ద ఉన్న పెద్ద చెరువు పూర్తిగా నీటితో నిండడంతో అన్నదాతలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఆయకట్టు భూముల్లో వరి నాట్లు దాదాపు పూర్తి చేశారు. గత ఏడాది సరైన వర్షాలు లేక చెరువులోకి నీరు చేరలేదు. ఈ ఏడాది సరిపడినంతమేర నీరు చేరడంతో గత ఏడాది కంటే 50 ఎకరాల్లో అదనంగా నాట్లు పడ్డాయి. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో చెరువులో పూడికలు తీయించడం వల్ల నీరు నిల్వ ఉండడంతో ఆయకట్టు భూములకు నీరందుతోందని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. మండలంలోని బయ్యవరం పెద్ద చెరువు కింద సుమారు 500 ఎకరాల ఆయకట్టు ఉంది. నీటి పారుదల శాఖకు చెందిన ఈ చెరువు కింద ఏటా ఖరీఫ్‌లో వరి సాగు చేస్తుంటారు. ఆయకట్టుకు వర్షాలతోపాటు చెరువు నీరు ప్రధాన ఆధారం. **వర్షాలు పడినప్పుడు మండలంలోని విసన్నపేట వద్ద ఉన్న కొండ గెడ్డ నీరు వచ్చి చెరువులో చేరుతుంది. అలా నీరు చేరిన తరువాత** ఆయకట్టు రైతులు వరి నాట్లు వేయడం ప్రారంభిస్తారు. నాట్లు పూర్తి అయ్యాక పంట పండే వరకు చెరువు నీటిని వినియోగిస్తారు. గత ఏడాది సరైన వర్షాలు లేక చెరువులోకి తగిన నీరు చేరలేదు. దీంతో తక్కువ విస్తీర్ణంలో పంట సాగు చేశారు. ఈ ఏడాది అదనంగా 50 ఎకరాల్లో వరి నాట్లు వేసినట్లు అధికారిక సమాచారం. గత ఏడాది 430 ఎకరాల్లో నాట్లు వేయగా, ఈ ఏడాది 480 ఎకరాల్లో నాట్లు వేశారు.మొదట్లో సరైన వర్షాలు లేక చెరువులో నీరు చేరని పరిస్థితిలో రైతులు నిరాశనిస్పృహలకు గురయ్యారు. ఈ నేపథ్యంలో గత నెలలో అల్పపీడనం వల్ల కురిసిన భారీ వర్షాలతో చెరువులో నీరు చేరింది. దీంతో 20 రోజుల క్రితం నాట్లు వేయడం ప్రారంభించారు. **ఇటీవల అడపా దడపా కురుస్తున్న వర్షాలకు చెరువులో మరింతగా నీరు చేరడంతో నాట్లు వేయడం దాదాపు పూర్తి అయ్యింది.** అయితే ఈ ఏడాది నారు దశలో సరైన వర్షాలు లేక ఎదుగుదల లోపించి, ఎండిపోయింది. దీంతో కొంత మంది నాట్లు వేయకుండా పొలాలను వృథాగా వదిలి వేశారు. ఏది ఏమైనా ఈ ఏడాది చెరువులో నీరు పుష్కలంగా చేరడంతో నాట్లు పూర్తి కావడానికి దోహదపడిందని రైతులు తెలిపారు.ఇందుకు వైఎస్సార్ సీపీ ప్రభుత్వం చూపిన ప్రత్యేక శ్రద్ధ కారణంగా నిలుస్తోంది. అప్పటి మంత్రి గుడివాడ అమర్‌నాథ్, ఎంపీ డాక్టర్ భీశెట్టి వెంకట సత్యవతి కృషితో అచ్యుతాపురం వద్ద ఉన్న అంబుజా సిమెంట్ పరిశ్రమ నిర్వాహకుల సహకారంతో సుమారు రూ.20 లక్షలు వెచ్చించి చెరువులో పూడిక తీయించారు. చెరువుకు నీరు వచ్చే కొండగెడ్డ కాలువకు మరమ్మతులు చేయించారు. దీంతో ఏ మాత్రం వర్షం కురిసినా కొండగెడ్డ నీరు వచ్చి చెరువులో చేరి నిల్వ ఉంటోంది. ఆయకట్టు భూములకు సమృద్ధిగా సాగు నీరు అంది పంటలు పండటానికి దోహదపడుతుండటంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

పూర్తిస్థాయిలో నీరు చేరింది



ఈ ఏడాది పెద్ద చెరువులోకి పూర్తిస్థాయిలో నీరు చేరింది. దీంతో కౌలుకు తీసుకున్న 60 సెంట్లు, సొంత భూమి 30 సెంట్లలో వరి నాట్లు వేశాను. గత ఏడాది కూడా పంట వేసినప్పటికీ చివరి దశలో వర్షాలు దెబ్బతీశాయి. ఇప్పుడు వాతావరణం అనుకూలంగా ఉన్నందున, చెరువులో నీరు చేరడం వల్ల ఈ ఏడాది అయినా పంట పండి కష్టాల నుంచి గట్టెక్కగలనని ఆశిస్తున్నాను.

– గొల్లవిల్లి దుర్గినాయుడు, రైతు, బయ్యవరం

జల దిగ్బంధంలో సత్తెమ్మపేట కాలనీ



సత్తెమ్మపేటలో ఇళ్ల మధ్యలో నిలిచిపోయిన వర్షం నీరు



బయ్యవరం రైల్వే స్టేషన్ వద్ద పంట భూమిలో చేరిన వర్షం నీరు



కశింకోట మేదర వీధిలో రోడ్డుపై చేరిన నీరు

తుమ్మపాల: ఇటీవల కురిసిన వర్షాలకు మండలంలో శంకరం పంచాయతీ సత్తెమ్మపేట కాలనీ జలదిగ్బంధంలో చిక్కుకుంది. బుధవారం కురిసిన భారీవర్షంతో పెద్ద ఎత్తున నీరు చేరి, కాలనీకి వెళ్లే అన్ని దారులు జలమయమయ్యాయి. ఇళ్లలోకి వర్షం నీరు చేరడంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. కాలనీకి దిగువన ఉన్న శ్మశానవాటికలో కొంత భాగంలో ప్రైవేటు వ్యక్తులు రోడ్డు వేయడంతో కిందకు పోవాల్సిన వర్షపునీరు కాలనీలో నిలిచిపోతోందని స్థానికులు తెలిపారు. అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని వారు వాపోయారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి తమ సమస్యను పరిష్కరించాలని వారు కోరారు.

కశింకోట: మండలంలో బుధవారం మధ్యాహ్నం భారీ వర్షం కురిసింది. లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. స్థానిక పీహెచ్‌సీకి వెళ్లే రోడ్డు, మేదరవీధి, స్టేట్ బ్యాంకు, గాడి వీధి తదితర ప్రాంతాల్లో రోడ్లపైకి నీరు చేరింది. బయ్యవరం రైల్వే స్టేషన్ రోడ్డు వద్ద పంట పొలాల్లోను, అక్కడి పెద్ద చెరువులోను భారీగా నీరు వచ్చి చేరింది.

సుడిదోమ నివారణకు చర్యలు చేపట్టాలి



వరి పొలాల్లో పసుపు పళ్లెలు, పక్షి స్థావరాలు ఏర్పాటుచేస్తున్న ప్రకృతి వ్యవసాయ సిబ్బంది

తుమ్మపాల: వరిపైరులో సుడిదోమ నివారణకు ప్రకృతి వ్యవసాయ పద్ధతుల ద్వారా పసుపు పళ్లెలు, పక్షి స్థావరాలు ఏర్పాటు చేసుకోవాలని మార్కెటింగ్ మాస్టర్ ట్రైనర్ సిరసపల్లి అప్పలరాజు అన్నారు. తుమ్మపాలలో వరిపొలాలను బుధవారం ఆయన పరిశీలించి, రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయ పద్ధతులు పాటిస్తే చీడపీడల నుంచి వరి పంటను కాపాడుకోవచ్చన్నారు. పొలాల్లో ఏర్పాటు చేసే పక్షి స్థావరాలపై పక్షులు నిలబడి పంటకు హాని చేసే పురుగులను ఏరుకుని తినే వీలుంటుందని, తద్వారా రైతు అధిక దిగుబడి సాధించవచ్చన్నారు. వరి పంట వేసేందుకు 45 రోజుల ముందు నవధాన్యాలు జల్లుకోవడం వల్ల పంటలో కలుపు లేకుండా ఉంటుందన్నారు. ప్రకృతి వ్యవసాయంలో పండించిన ఉత్పత్తులకు మార్కెట్‌లో మంచి గిరాకీ ఉందని చెప్పారు. ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులను ప్రతి సోమవారం కలెక్టరేట్‌లో, ప్రతి గురువారం పట్టణంలో మున్సిపల్ కార్యాలయం వద్ద ప్రత్యేక స్టాల్ ద్వారా మార్కెటింగ్ చేస్తున్నట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో యూనిట్ ఇన్‌చార్జ్ నాగేశ్వరరావు, అప్పారావు, సంతోష్ కుమార్ పాల్గొన్నారు.

నిరంతర అధ్యయనంతో మెరుగైన బోధన



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ చంద్రశేఖర్

పెందుర్తి: విద్యార్థులకు మెరుగైన విద్యా బోధన అందించేందుకు అధ్యాపకులు సాంకేతిక రంగంలో జరుగుతున్న రోజువారీ మార్పులపై నిరంతరం అధ్యయనం చేయాలని స్థానిక ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.చంద్రశేఖర్ సూచించారు. కళాశాలలో బుధవారం ఏఆర్‌ఎం కార్టెక్స్ ఎం3 ఆధారిత ఎంబెడెడ్ సిస్టమ్స్‌పై ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్(ఎఫ్‌డీపీ)ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ ఇలాంటి శిక్షణ తరగతులతో అధ్యాపకులకే కాకుండా విద్యార్థులకు కూడా పరిశ్రమలలో అవసరమైన సాంకేతిక నైపుణ్యాలను అభివృద్ధి చేసుకునే అవకాశం ఉంటుందన్నారు. ఈసీఈ విభాగాధిపతి, శిక్షణ కార్యక్రమ సమన్వయకర్త ఎం.నాగమణి పలు సూచనలు, సలహాలు అందించారు. మై యాక్సెస్ సంస్థ వ్యవస్థాపకుడు తామరపల్లి సూర్య ఆధ్వర్యంలో జరిగిన తొలి రోజు కార్యక్రమంలో 5 ప్రభుత్వ, 10 ప్రైవేట్ పాలిటెక్నిక్ కళాశాలల అధ్యాపకులు పాల్గొన్నారు.

‘ఫొటో, వీడియోగ్రాఫర్లకు చేయూతనివ్వాలి’



ఆత్మీయ సమావేశంలో మండలంలోని ఫొటో, వీడియోగ్రాఫర్లు

సబ్బవరం: మండలంలోని అయ్యన్నపాలెం వద్ద సబ్బవరం మండల శ్రీదుర్గమాంబ ఫొటో, వీడియోగ్రాఫర్స్ అసోసియేషన్ ఆత్మీయ సమావేశం బుధవారం జరిగింది. కార్యక్రమంలో ఫొటోగ్రాఫర్స్ సమస్యలపై చర్చించి, ప్రభుత్వం తమకు చేయూతను ఇవ్వాలని కోరారు. ఈ సమావేశానికి మండలంలోని 70 మంది వరకూ ఫొటోగ్రాఫర్లు, వీడియోగ్రాఫర్లు హాజరయ్యారు. కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు కామిరెడ్డి అప్పారావు, ఉపాధ్యక్షుడు శీరం రాజేష్, కార్యదర్శి బొజ్జ శివ, సంయుక్త కార్యదర్శి జి.మధు, కోశాధికారి సుంకర శివ, అడ్వయిజరీ కమిటీ గౌరవ అధ్యక్షుడు పోనగంటి కిశోర్, మేడపాటి రాము, ముమ్మన అప్పలరాజు, ఆరిపాక ప్రసాద్, ఎస్ శ్రీను, మిడతాడ వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు వ్యాస రచన పోటీలు

అనకాపల్లి టౌన్: భగవాన్ సత్యసాయి బాబా శత జయంతి వేడుకల్లో భాగంగా మానవతా విలువలతో కూడిన సత్యసాయి విద్యా విధానం విశిష్టతను తెలియజేస్తూ వ్యాసరచన పోటీలు నిర్వహిస్తున్నట్టు ఆ సంస్థల రాష్ట్ర అధ్యక్షుడు ఆర్.లక్ష్మణరావు ఓ ప్రకటనలో తెలిపారు. జిల్లా విద్యాశాఖాధికారుల అనుమతితో ఈ పోటీలు నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. హైస్కూల్ స్థాయిలో 8,9,10 తరగతుల విద్యార్థులకు ‘కర్తవ్యమే దైవం’ అనే అంశంపై, ఇంటర్మీడియెట్ విద్యార్థులకు మనం ‘ఈ రోజు చేసే పనులపై రేపటి భవిష్యత్ ఆధారపడి ఉంది లేదా రేపటి భవిష్యత్ నేడు మన చేతుల్లో ఉంది అనే అంశంపై, డిగ్రీ విద్యార్థులకు మార్పు అనేది ముందు నీతో మెదలైతే ప్రపంచంలో పరివర్తనకు నాంది కాగలదు అనే అంశంపై ఈ పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. జిల్లా స్థాయిలో ప్రథమ స్థానం సాధించిన విద్యార్థికి, రాష్ట్ర స్థాయికి పంపిస్తామని తెలిపారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు వినియోగించుకోవాలని పేర్కొన్నారు. ఈ పోటీలు ఈ నెల 15 నాటికి జిల్లా స్థాయిలో పూర్తి చేయాలని సత్యసాయి జిల్లా ప్రతినిధులను ఆయన కోరారు.

బాల్య వివాహాలతో అనర్థాలు



మాట్లాడుతున్న జిల్లా బాలల సంరక్షణ అధికారి రమేష్

కశింకోట: బాల్య వివాహాలకు దూరంగా ఉండాలని జిల్లా బాలల సంరక్షణ అధికారి రమేష్ తెలిపారు. బాల్య వివాహాల వల్ల పలు అనర్థాలు కలుగుతాయని చెప్పారు. మండలంలోని తేగాడ వద్ద ఉన్న కస్తూర్బాగాంధీ విద్యాలయంలో బుధవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 18 ఏళ్లు నిండకుండా బాలికలకు వివాహం చేయరాదన్నారు. బాలికలు, మహిళల రక్షణకు పలు చట్టాలు ఉన్నాయని, వాటిని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో పీవో ఎస్.ఐ.సి. మనోహర్, కౌన్సెలర్ ఎం.డి. భాను తదితరులు పాల్గొన్నారు.

అప్పన్న సన్నిధిలో పర్యాటకశాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామిని రాష్ట్ర పర్యాటక, యువజన సాంస్కృతికశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అజయ్ జైన్ బుధవారం సతీసమేతంగా దర్శించుకున్నారు. ఆలయ ధ్వజస్తంభం వద్ద అర్చకులు ఆయనకు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం ఆయన ఆలయంలోని కప్పస్తంభాన్ని ఆలింగనం చేసుకుని, బేడా మండపంలో ప్రదక్షిణ చేశారు. అంతరాలయంలో ఆయన పేరిట అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేద ఆశీర్వచనం అందించారు. ఆలయ సంప్రదాయం ప్రకారం స్వామివారి ప్రసాదం, జ్ఞాపిక, శేషవస్త్రాలను డిప్యూటీ ఈవో రాధ అందజేశారు.

అప్పన్నకు వైభవంగా నిత్యకల్యాణం



నిత్యకల్యాణంలో మాంగళ్యధారణ ఘట్టం నిర్వహిస్తున్న అర్చకులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహ స్వామికి బుధవారం నిత్యకల్యాణం వైభవంగా జరిగింది. ఆలయ బేడామండపంలో ఉదయం 9.30 నుంచి ఈ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను వేదికపై వేంజేపచేశారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగళ్యధారణ, తలంబ్రాలు తదితర ఘట్టాలతో కల్యాణాన్ని శాస్త్రోక్తంగా జరిపారు. ఉభయదాతలకు కల్యాణ అక్షింతలు, ప్రసాదం, శేషవస్త్రాలు అందించారు.

నేడు మెగా జాబ్ మేళా

అనకాపల్లి టౌన్: పట్టణంలోని రాజా థియేటర్ ఎదురుగా ఉన్న గవర్నమెంట్ జూనియర్ కాలేజీలో గురువారం మెగా జాబ్ మేళా నిర్వహించనున్నట్టు రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ జిల్లా అధికారి డాక్టర్ ఎన్.గోవిందరావు ఓ ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించే ఈ మేళాలో సుమారు 20 కంపెనీలు పాల్గొంటున్నాయని పేర్కొన్నారు. ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు జరిగే ఈ మేళాలో 10వ తరగతి, ఐటీఐ, డిప్లమో, డిగ్రీ, పీజీ విద్యార్హత కలిగిన, 18 నుంచి 35 సంవత్సరాల యువతీయువకులు పాల్గొవచ్చని తెలిపారు.

తాళ్లపాలెం గ్రంథాలయం సందర్శన



రికార్డులను పరిశీలిస్తున్న ఉమ్మడి విశాఖ జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి కుమార్‌రాజా

కశింకోట: మండలంలోని తాళ్లపాలెం శాఖ గ్రంథాలయాన్ని ఉమ్మడి విశాఖ జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి బి.కుమార్‌రాజా బుధవారం ఆకస్మికంగా సందర్శించారు. గ్రంథాలయ రికార్డులను తనిఖీ చేశారు. గ్రంథాలయ ఆవరణను, పరిశుభ్రతను పరిశీలించి నిర్వహణ బాగుందని సంతృప్తి వ్యక్తం చేశారు. పాఠకుల సంఖ్యను పెంపొందించడానికి కృషి చేయాలని ఈ సందర్భంగా గ్రంథాలయ అధికారి కె.జగన్‌కు సూచించారు. పంచాయతీ నుంచి రావలసిన గ్రంథాలయ పన్ను బకాయిల వసూలు చేయాలన్నారు.

శరన్నవరాత్రి ఉత్సవాలకు పందిరి రాట



కనకదుర్గమ్మ ఆలయం వద్ద పందిరి రాట వేస్తున్న అర్చకులు, భక్తులు

అనకాపల్లి: శరన్నవరాత్రి ఉత్సవాలకు స్థానిక గవరపాలెం సతకంపట్టు కనకదుర్గమ్మ వారి ఆలయం వద్ద బుధవారం ఆలయ అర్చకులు భోగపురపు వెంకటరమణ ఆధ్వర్యంలో వ్యాపారవేత్తలు పి.వెంకట అప్పారావు, కోరుబిల్లి గంగాధర్ దంపతులు పందిరాట మహోత్సవాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ వ్యవస్థాపకుడు పి.వి.రమణ, ఆలయ శాశ్వత చైర్మన్ కాండ్రేగుల నాయుడు, ఉత్సవ కమిటీ చైర్మన్ భీమరశెట్టి వరాహ నూకరాజు తదితరులు పాల్గొన్నారు.



పార్కు సెంటర్ వద్ద పందిరి రాట వేస్తున్న నవయువతరం స్వచ్ఛంద సంస్థ కమిటీ సభ్యులు

గవరపాలెం పార్కుసెంటర్ వద్ద...

స్థానిక గవరపాలెం పార్కుసెంటర్ వద్ద శరన్న నవరాత్రిల ఉత్సవాలకు నవయువతరం స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో పందిరి రాట వేశారు. ఈ సందర్భంగా సంస్థ ప్రతినిధి దూలం గోపి మాట్లాడుతూ ఈ నెల 22వ తేదీ నుంచి నవరాత్రి ఉత్సవాలను నిర్వహించనున్నట్టు తెలిపారు. ఈ ఉత్సవాల్లో ప్రతి రోజు అమ్మవారి ఆలయం వద్ద ప్రత్యేక హోమాలు, కుంకుమ పూజలు నిర్వహించనున్నట్టు చెప్పారు. సంస్థ సభ్యులు మారిశెట్టి భాస్కర్, కాండ్రేగుల గోవింద్, బుద్ధ జగన్, యూసఫ్,శంకర్, వంశీ, కుమార్, పవన్, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

64 పశువులకు చికిత్స



పల్లపు సోమవరంలో పశువులకు గర్భ కోశ పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

కశింకోట: మండలంలోని పల్లపు సోమవరంలో ఉమ్మడి విశాఖ జిల్లా పశు గణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో రాష్ట్రీయ గోకుల మిషన్ సహకారంతో బుధవారం నిర్వహించిన ఉచిత గర్భకోశ చికిత్స శిబిరంలో 64 పశువులకు సేవలందించారు. పశు సంవర్ధక శాఖ గర్భకోశ చికిత్స నిపుణురాలు పి.హరిప్రియ, అనకాపల్లి ఏరియా పశు వైద్యాలయ సహాయ సంచాలకురాలు బి. సౌజన్య పశువులకు వైద్యసేవలందించి, ఖనిజ లవణ మిశ్రమాన్ని ఉచితంగా పంపిణీ చేశారు. 43 పెయ్యిలకు నట్టల నివారణ మందు అందజేశారు. అనకాపల్లి నుంచి వచ్చిన సిబ్బంది పేడ పరీక్షలు చేశారు. ఈ కార్యక్రమంలో నరసింగబిల్లి, కశింకోట పశువుల ఆస్పత్రి వైద్యాధికారులు అల్ఫోన్సా జార్జ్, చైతన్య మణి, సిబ్బంది పాల్గొన్నారు.

డ్రైనేజీ నిర్మించాలి



తాళ్లపాలెంలోని డ్రైనేజీ లేని కర్రి వారి వీధి

కశింకోట: మండలంలోని తాళ్లపాలెంలో దుర్గాలమ్మ పేట వద్ద కర్రి వారి వీధిలో డ్రైనేజీ మంజూరైనప్పటికీ నిర్మించకుండా తాత్సార్యం చేస్తున్నారని స్థానికులు తెలిపారు. తమ ప్రాంతంలో సిమెంట్ రోడ్డు వేసినప్పటికీ డ్రైనేజీ నిర్మించలేదన్నారు. రోడ్డు ఎత్తులో ఉండటంతో ఏ మాత్రం వర్షం పడినా నీరు ఇళ్లలోకి చేరి, తీవ్ర ఇబ్బంది పడాల్సి వస్తోందని వాపోయారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి డ్రైనేజీ నిర్మించాలని వారు కోరారు.

ఐలమ్మకు ఘన నివాళి



ఐలమ్మ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఐద్వా నాయకులు

అనకాపల్లి: స్థానిక సీఐటీయూ కార్యాలయంలో అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం(ఐద్వా) ఆధ్వర్యంలో దివంగత ఐద్వా రాష్ట్రనాయకురాలు సకల ఐలమ్మకు ఘనంగా నివాళులర్పించారు. వర్ధంతి సందర్భంగా నిర్వహించిన బుధవారం సభలో ఐలమ్మ చిత్రపటానికి ఐద్వా జిల్లా అధ్యక్షురాలు పి.మాణిక్యం, సీనియర్ నాయకురాలు కె.వి.ఎస్.సూర్యప్రభ పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఐలమ్మ రైతుల సమస్యల పై అనేక పోరాటాలు చేశారని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఐద్వా జిల్లా కార్యదర్శి డి.డి. వరలక్ష్మి, నాయకులు కె.వి.ఎస్. సూరిబాబు, జి.గౌరీ, జి. నారాయణమ్మ, ఆర్.లక్ష్మి, తుంపాల అన్నపూర్ణ పాల్గొన్నారు.